మోగిన బడిగంట

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య
విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి : డీఈవో
ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి : ఎమ్మెల్యే

వేదాశీర్వచనం చేస్తున్న అర్చకులు

స్వామివారి సేవలో హిమాచల్ ప్రదేశ్ ప్రధాన కార్యదర్శి

యాదగిరిగుట్ట, జూన్ 12: యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామివారిని హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభోద్ సక్సేనా దర్శించుకున్నారు. గురువారం యాదగిరిగుట్టకు చేరుకున్న ఆయనకు అర్చకులు ఆలయ సంప్రదాయరీతిలో ఘన స్వాగతం పలికారు. ఆలయ ముఖ మండపంలోకి వెళ్లిన ఆయన ధ్వజస్తంభానికి మొక్కారు. అనంతరం గర్భాలయంలోకి ప్రవేశించి స్వయంభూ పంచనారసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం ముఖ మండపంలో ఆయన అర్చకులు, వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు.

గవర్నర్ పర్యటనలో వ్యక్తికి గాయాలు

వైద్య చికిత్స పొందుతున్న యాదగిరి

భూదాన్‌పోచంపల్లి, జూన్ 12 : రాష్ట్ర గవర్నర్ పర్యటనను తిలకించేందుకు వచ్చిన ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. గవర్నర్ విష్ణు దేవ్ వర్మ గురువారం భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. గవర్నర్‌ను తిలకించేందుకు పోచంపల్లికి చెందిన చింతకింది యాదగిరి వినోబా మందిరం వద్దకు చేరుకుని అక్కడే కూర్చున్నాడు. గవర్నర్ పర్యటన కోసం కేబుల్ వైర్ల మీద రాయి సపోర్ట్‌గా పెట్టారు. టూరిజం పార్కు నుంచి వెళ్తున్న వాహనానికి కేబుల్ వైరులు తాకడంతో ప్రమాదవశాతు యాదగిరి తలపై రాయి పడడంతో తీవ్ర గాయం అయింది. వెంటనే బాధితుని చికిత్స నిమిత్తం పార్క్ ఆవరణలోని వైద్య బృందం వద్దకు తరలించారు. బాధితునికి చికిత్స చేసి ఇంటికి పంపించారు.

నారాయణ స్కూల్‌పై చర్య తీసుకోవాలి

చౌటుప్పల్ , జూన్ 12 : పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు తీసుకుంటున్న నారాయణ స్కూల్ పై చర్య తీసుకోవాలని బీఆర్ఎస్‌వీ నియోజకవర్గం అధ్యక్షులు నలపరాజు రమేష్ గురువారం ఎంఈవో కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. నిబంధలు తుంగలో తొక్కి విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతుందని ఆయన పేర్కొన్నారు. తక్షణమే ఈ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మూతపడిన పాఠశాలలు పునః ప్రారంభం

మహదేవ్‌నూర్‌లో ఎంపీపీఎస్ పాఠశాలను పున ః ప్రారంభించిన ఎంఈవో సురేశ్‌రెడ్డి

బీబీనగర్, జూన్ 12 : వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. మండలంలోని మహదేవ్‌పూర్, పెద్దపలుగుతండా,లక్ష్మీదేవిగూడెం గ్రామాల్లో గతంలో విద్యార్థులు లేక మూత పడిన పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి సురేశ్‌రెడ్డి పునః ప్రారంభించారు. పాఠశాలలకు వచ్చిన విద్యార్థులకు యూనిఫాం, నోట్‌బుక్స్‌లను పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అందజేశారు.

మత్స్య పారిశ్రామిక మహిళా సహకార సంఘం ఏర్పాటు

బీబీనగర్, జూన్ 12 : మండలంలోని వెంకిర్యాల గ్రామంలో మత్స్య పారిశ్రామిక మహిళా సహకార సంఘం నూతన కమిటీ ఏర్పాటు చేశారు. బుధవారం ఆ సంఘం ఎఫ్‌డీవోఎం రాజారాం, సంఘం అధ్యక్షురాలు బాలమణికి సంఘం రిజిస్టర్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓఎం రాజారాం మాట్లాడుతూ మహిళలు సంఘం ఏర్పాటు ద్వారా ఉపాధి పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం భువనగిరి జిల్లా గౌరవ అధ్యక్షుడు రాచమల్ల శ్రీనివాసులు, వెంకీర్యాల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పూస జహంగీర్, ప్రధాన కార్యదర్శి సాలయ్య, డైరెక్టర్లు, సంఘం ప్రధాన కార్యదర్శి ఇటికాల శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

విదేశీ రాయబారి సంస్థ అధికారి శ్రీకర్‌రెడ్డికి పితృయోగం

మోత్కూరు, జూన్ 12: విదేశాంగ రాయాబారాధికారి కొప్పుల శ్రీ కర్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. కొండగడపలో తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్ కృష్ణారెడ్డి మృతదేహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం శ్రీకర్‌రెడ్డి, కుటుంబ సభ్యులను పరమర్శించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు సోమిరెడ్డి, సోంమల్లు, లింగయ్య, వేణు, నర్సయ్య అబ్బులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపు తనిఖీ

మోత్కూరు, జూన్ 12 : మండలంలోని పనకబండ రేషన్ షాపును మండల తహసీల్దార్ జ్యోతి గురువారం తనిఖీ చేశారు. ప్రభుత్వం లబ్ధిదారులకు మూడు నెలలకు సంబంధించిన బియ్యాన్ని ఒకేసారి అందిస్తున్నందున్న ఈ నెల చివరి వరకు బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. బయోమెట్రిక్, ఓటీపీఎస్ విధానంలో ప్రతి ఒక్కరికీ బియ్యం ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ సుమన్ పాల్గొన్నారు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS
PLOT FOR SALE
★సాగర్ హైవే, విజయవాడ హైవేలలో తక్కువ ధరలో అపార్ట్‌మెంట్ ప్లాట్లు, Indp. ప్లాట్లు & ఓపెన్ ప్లాట్లు HMDA/DTCP అప్రూవల్ LRS గల ప్లాట్లు కలవు. 9603444402.
NT-331100
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసింబిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములలో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ: 9182777625, 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638

ఆత్మకూరు(ఎం) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గంటను మోగిస్తున్న అటెండర్ యూసుబ్

బొమ్మలరామారం, జూన్ 12 : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడానికి ఉపాధ్యాయులు ,విద్యాకమిటీ సభ్యులు ,గ్రామస్తులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి సత్యనారాయణ అన్నారు. ఆయన గురువారం జలాల్‌పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్తు పాఠశాలతోపాటు ఖాజీపేట, నాగినేనిపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు.విద్యార్థుల వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో గణితం, ఇంగ్లీష్ , తెలుగు సెబ్జెక్ట్ విషయాలపై పలు ప్రశ్నలు అడిగి సామర్థ్యాలను పరిశీలించారు. ఈ విద్యాసంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా బోధన చేయాలని అన్నారు. ఎంఈఓ రోజారాణి, జీహెచ్ఎం నిర్మలాజ్యోతి, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, సీఆర్పీలు శ్రీహరి, విశ్వరూపం, జహంగీర్ పాల్గొన్నారు.

యావాపూర్ విద్యార్థులతో అక్షరాలు రాయిస్తున్న ప్రభత్వ విప్ బీర్ల ఐలయ్య

జలాల్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యాసంవత్సరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో సత్యనారాయణ

బొమ్మలరామారంలో..

బొమ్మలరామారం, జూన్12 : ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. యావాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గత రెండు సంవత్సరాలుగా మూతబడింది. గ్రామస్తులు విజ్ఞప్తి మేరకు ఆయన స్కూల్‌లో అన్ని వసతులు కల్పించి గురువారం పాఠశాలను పునఃప్రారంభించారు. ప్రభుత్వం అంగన్‌వాడీలో చదువుకునే పిల్లలకోసం ప్రవేశపెట్టిన ఎగ్ బిర్యాణి పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ అడల్ట్‌స్కూల్ ఎడ్యుకేషన్ శ్రీమతి ఉషారాణి, జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ, అంగన్‌వాడీ సీడీపీవో శైలజ, ఎంఈఓ రోజారాణి, ఎంపీడీవో రాజాత్రివిక్రమ్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్ రావు, రాజునాయక్ , నిర్మలాజ్యోతి పాల్గొన్నారు.

భువనగిరి కలెక్టరేట్..

భువనగిరి కలెక్టరేట్, జూన్ 12 : విద్యార్థులు కష్టపడి చదివి ప్రయోజకులుగా ఎదిగి పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని మాజీ ఎంపీపీ నరాల నిర్మలవెంకట స్వామి అన్నారు. గురువారం బస్వాపురంలో ప్రభుత్వ పాఠశాల మొదటి రోజు ప్రారంభాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంను అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మౌలిక వసతులతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాయగిరి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అండాలు, గ్రామస్థులు వెంకటేశ్, నవీన్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం)లో..

ఆత్మకూరు (ఎం), జూన్ 12 : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు తెర్చుకుని బడిగంటలు మోగాయి. ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు నోటు పుస్తకాలు, దుస్తులు అందజేసినట్లు ఎంఈవో మహదేవరెడ్డి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలను మండల కేంద్రంలోని వసతిగృహంలో చేర్పించాలని ఎస్సీ బాలికల వసతిగృహం అధికారి ప్రసన్న గురువారం మండలంలోని తిమ్మాపురంలో ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించారు. వసతిగృహాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ బడీడు బాలికలను బడిలో చేర్పించాలని కోరారు.

రాజాపేటలో..

రాజాపేట, జూన్ 12 : ప్రైవేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన బోధన అందుతుందని సింగారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత అన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేరిన విద్యార్థులకు పూల బొకేలు అందించి అభినందనలు తెలిపారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న మాజీ ఎంపీపీ నిర్మలవెంకటస్వామి

ఆత్మకూరు(ఎం) అవగాహన కల్పిస్తున్న ఎస్సీ బాలికల వసతిగృహం అధికారి ప్రసన్న

విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అండాలు

చింతపండు దొంగతనంపై హైలెవల్ విచారణ కమిటీ

సత్యనారాయణ వ్రతం టికెటు
రూ.1000కి పెంపు : ఈవో వెంకటరావు

యాదగిరిగుట్ట, జూన్ 12: స్వామివారి ఆలయంలోని ప్రసాద విక్రయశాలలో జరిగిన చింత పండు దొంగతనం కేసులో దేవాదాయధర్మాదాయశాఖ అదనపు కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హైలెవల్ విచారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు దేవాదాయధర్మాదాయ రాష్ట్ర కమిషనర్, ఈవో వెంకట్రావ్ తెలిపారు. ఈ కమిటీలో దేవాదాయధర్మా దాయ శాఖ రిజనల్ జాయింట్ కమిషనర్ తో పాటు రంగారెడ్డి, నల్లగొండ, సికింద్రాబాద్ కు చెందిన దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్లు ఉంటారని అన్నారు. ఈ కమిటీతో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నివేదిక అందిన తర్వాత దోషులపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ప్రైమమెన్ కమిటీ వేయగా ప్రాథమిక నివేదిక ఇచ్చారని అన్నారు. కానీ నివేదిక సరైన పద్ధతిలో జరుగలేదని, సంతృప్తికరంగా లేదన్నారు. ఈ కమిటీ సోమవారం నుంచి విచారణ చేపడుతుందన్నారు. సత్యనారాయణ స్వామి వ్రతమాచరించే భక్తులకు గతంలో రూ.800 టికెటు ఉండగా దీనికి రూ.1,000 పెంచి భక్తులకు స్వామివారి శేల్లా, కనుముతో పాటు స్వామివారి ప్రతిమను అందజేస్తామన్నారు. ప్రతి భక్తుడికి స్వామివారి పులిహోరతోపాటు ప్రతి శనివారం స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందజేస్తామన్నారు. ఇందుకు సంబంధించి ఈ నెల 14 నుంచి ఫైలెట్ ప్రాజెక్టును ప్రారంభిస్తామన్నారు. జూలై 1వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో కొనసాగింపు ఉంటుందన్నారు.

ఉచిత ప్రసాద వితరణలో దాతలను వినియోగించుకుంటామన్నారు. ఇందుకు దాతలు మందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఆలయ పరిసర ప్రాంతాలలో సూచిక బోర్డును ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ప్రధానార్చకులు లక్ష్మీనరసింహచార్యులు, ఈఈలు రామారావు, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మాజీ విప్ సునీతారెడ్డి పరామర్శ

సముద్రాల రాములమ్మను పరామర్శిస్తున్న గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

ఆలేరు టౌన్, జూన్ 12 : ఆలేరు పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, వ్యాపారవేత్త సముద్రాల కుమార్ సతీమణి రాములమ్మ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స తీసుకుని ఇటీవల ఇంటికి వచ్చిన విషయం తెలుసుకొని ప్రభుత్వ మాజీ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి గురువారం వారి నివాసానికి వెళ్లి పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించారు.రాములమ్మను ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని ,కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేశం గౌడ్, బింగి రవి, పంతం కృష్ణ, మాజీ సర్పంచ్ చింతకింది మురళి, ఏసీరెడ్డి మహేందర్‌రెడ్డి, ఎండీ ఫయాజ్, కటకం బాల రాజు, బాసని ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలరామారంలో..

వెంకటేశ్వరరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రభుత్వ మాజీ విప్

బొమ్మలరామారం, జూన్ 12 : మండల కేంద్రంలోని ఎపీ ఎక్స్‌ప్లోసివ్ కంపెనీ యజమాని వెంకటేశ్వరరెడ్డికి ఇటీవల మాతృ వియోగం జరిగింది. గురువారం ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి కుటుంబాన్ని కీసర మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పోలగాని వెంకటేశ్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గూడె బాలనర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ తరితరులు పాల్గొన్నారు .

ఎయిమ్స్‌లో పేదలకు మెరుగైన వైద్యం
మరో సంవత్సర కాలంలో పూర్తి స్థాయి వైద్యసేవలు
ఎయిమ్స్ బోర్డు మెంబర్, ఎంపీ డీకే అరుణ

బీబీనగర్, జూన్ 12 : ఎయిమ్స్‌లో పేదలకు మరో సంవత్సర కాలంలో పూర్తి స్తాయి వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని బోర్డు మెంబర్, ఎంపీ డీకే అరుణ అన్నారు. గురువారం మండల పరిధిలోని బీబీనగర్ ఎయిమ్స్‌ను సందర్శించి అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని మోదీ పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పది రూపాయలకే అత్యాధునిక వైద్యం అందించాలన్న ఉద్దేశంతో భువనగిరి జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 2026 నాటికి పూర్తిస్థాయి సేవలందించడానికి కృషి చేస్తామని తెలిపారు. భవన నిర్మాణాలు పూర్తయి అందుబాటులోకి వస్తే ఎంతో మంది పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉట్కూర్ అశోక్ గౌడ్, పాశం భాస్కర్, రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణరెడ్డి, దాసరి మల్లేశం, ఏల చంద్రశేఖర్, రచ్చ శ్రీనివాస్, భువనగిరి సదానందం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌ను సందర్శించిన ఎయిమ్స్ బోర్డు మెంబర్, ఎంపీ డీకే అరుణ

మోత్కూరు సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

మోత్కూరు, జూన్ 12 : మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్‌ను సీపీఐ మండల, మున్సిపాలిటీ కమిటీల నాయకులు కోరారు. గురువారం కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మున్సిపాలిటీలోని రెండో వార్డులో రామలింగేశ్వరస్వామి ఆలయం సమీపంలోని ఇండ్ల వద్ద నూతనంగా నిర్మాణం చేసిన డ్రైనేజిని అసంపూర్తిగా వదిలి వేయడంతో డ్రైనేజి నీరు అక్కడే నిల్వ ఉండి దుర్వాసన వస్తుందన్నారు. మంచినీటి బోరు అక్కడే ఉండటం వల్ల మురికి నీరు తాగునీటి సరఫరా పైపులైన్‌లో కలిసి కలుషితమవుతుందన్నారు. అదే విధంగా సుందరయ్య కాలనీలో నిర్మాణం చేసిన డ్రైనేజిలను నిర్మాణం చేసి క్యూరింగ్ కోసం నీళ్లు పోయడం లేదన్నారు. గడిబజార్, అన్నెపువాడ, మినీ ట్యాంక్ బండ్, కాశవారిగూడెం, అన్నెపువాడ, పద్మశాలి కాలనీల్లో వీధిలైట్లు వెలగడం లేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వానకాలం సీజన్ కావడంతో పలు వీధుల్లో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగాయని వాటి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వెంకట్, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, పట్టణ కార్యదర్శి ఉప్పలయ్య, నాయకులు మల్లేశ్, లక్ష్మీనర్సయ్య, యాదగిరి, కన్నయ్య, వెంకటేశ్వర్లు, ఆశందు, అశోక్, శ్రీహరి పాల్గొన్నారు.

స్వామి వారి హుండీ లెక్కింపు

యాదగిరిగుట్ట, జూన్12: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వా మి 44 రోజుల ఆలయ హుండీ లెక్కింపు గురువారం కొండకింద వ్రతం మండపంలో చేపట్టినట్లు ఆలయ ఈఓ వెంకటరావు తెలిపారు. నగదు రూ. 4,47,66,560.00 సమకూరిందని ఆయన వెల్లడించారు. 115 గ్రాముల బంగారం, ఆరు కిలోల 50 గ్రాముల వెండి వచ్చిందన్నారు. వీటితో పాటు అమెరికాకు చెందిన 1623 డాలర్లు, ఆస్ట్రేలియాకు చెందిన 85 డాలర్లు, ఇంగ్లాండ్ కు చెందిన 75 పౌండ్స్, నేపాల్ కు చెందిన 130 రుపిస్, సౌదీ ఆరేబియన్ కు చెందిన 106 రియల్, సింగపూర్ కు చెందిన 10 డాలర్స్, కతర్‌కు చెందిన 2.రియల్, ఒమన్ కు చెందిన 100 బైసకు చెందిన మలేషియాకు చెందిన 1 రింగ్గిట్స్, యూరప్ కు చెందిన 15 యూరో, థాయిలాండ్ కు చెందిన 280 బాట్లు తో పాటు టాంజానియా, అరబ్ ఎమిరేట్స్, రష్యా, ఈజిప్ట్, శ్రీలంక దేశాలకు చెందిన కరెన్సీ స్వామి వారికి సమకూరిందని ఆయన తెలిపారు.

పురుగుల మందుతాగి మహిళ ఆత్మహత్య

వలిగొండ, జూన్12: పురుగుల మందుతాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన వేములకొండలో చోటు చేసుకుంది. వేములకొండకు చెందిన గ్రామపంచాయతీ కార్మికురాలు కాడిగల్ల రాములమ్మ (55) కుటుంబ సమస్యలతో జీవితం మీద విరక్తి చెంది బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన ఆమెను కుటుంబ సభ్యులు గమనించి వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించి అనంతరం మెరుగైన చికిత్సకోసం భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యుగంధర్ తెలిపారు.

వారానికి రెండుసార్లు ఎగ్ బిర్యానీ

రాజాపేట, జూన్ 12 : మండలంలోని అంగన్ వాడీ కేంద్రంలో ప్రభుత్వం మార్చిన మెనూ కార్యక్రమం గురువారం ప్రారంభించారు. సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఎగ్ బిర్యానీని అందజేశారు. అంగన్ వాడీ రాజపేట సెక్టార్ సూపర్ వైజాగ్ రమణ మాట్లాడుతూ అంగన్ వాడీ కేంద్రాల్లో వారానికి రెండుసార్లు ఎగ్ బిర్యానీ అందజేస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, పార్వతి, భారతి, చంద్రకళ, సహాయకురాలు విజయ, తల్లులతోపాటు పిల్లలు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటనలో ఎస్ఐ దురుసు ప్రవర్తన

యాదాద్రి భువనగిరి, జూన్ 12 (నమస్తే తెలంగాణ) : భూదాన్ పోచంపల్లిలో గవర్నర్ పర్యటన సందర్భంగా స్థానిక ఎస్ఐ జులుం ప్రదర్శించారు. కార్యక్రమానికి వచ్చిన వారితో దురుసుగా ప్రవర్తించారు. అసభ్యకరంగా మాట్లాడి బెదిరింపులకు దిగారు. కార్యక్రమానికి వచ్చిన సంచార జాతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందుల యాదగిరిపై ఎస్ఐ భాస్కర్ రెడ్డి నోరుపారేసుకున్నారు. అరెయ్ అంటూ హెచ్చరిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ సంచార జాతి నాయకుడిని అందరి సమక్షంలో బెదిరించారని ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

రాజాపేట, జూన్ 12 : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని రేణికుంటలో గురువారం జరిగింది. రేణికుంటకు చెందిన రైతు బూర్గు నర్సిరెడ్డి చెందిన పాడి ఆవు మేస్తున్న క్రమం లో ట్రాన్‌ఫార్మర్ వద్ద ప్రమాదశాత్తు 11 కేవీఏ వైరు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. రూ. లక్ష విలువ గల పాడి ఆవు మృతి చెందిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

అనుమానాస్పస్థితిలో వ్యక్తి మృతి

వలిగొండ, జూన్12: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన నాగారం గ్రామ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగారం గ్రామ పరిధిలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు పక్కన కారు ఆగి ఉండటాన్ని గమనించిన పోలీసులు అనుమానంతో కారును తనిఖీ చేశారు. డ్రైవర్ సీటులో ఉన్న వ్యక్తి అప్పటికే మరణించి ఉన్నాడని. మృతుని వద్ద లభించిన ఆధార్ కార్డు, లైసెన్స్‌లో వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా, దర్శి మండలం, శివరాజ్‌నగర్‌కు చెందిన బండారి కృష్ణ(40) తండ్రి నరసింహగా ఆధారాలు ఉన్నాయని, మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యుగంధర్ తెలిపారు.